సాక్షి ఒడిశా

సోమవారం । 5 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,31,748
బంగారం : 2 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
వెండి : 19 గ్రాముల 900 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



బాలికపై అఘాయిత్యం
ఎనిమిదేళ్ల విద్యార్థినిపై లైంగికదాడి జరిగింది. రాజకీయ వర్గాలు భగ్గుమన్నాయి.
- 8లో

యువకుడి దారుణహత్య
విక్రమ్‌పూర్‌లో ఓ యువకుడిని హతమార్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.
- 8లో



న్యూస్‌రీల్

ఘనంగా చందన యాత్ర


వత్సచరణ అలంకరణలో మదన మోహనుడు

భువనేశ్వర్: పవిత్ర వైశాఖ శుక్ల సప్తమి తిథి పురస్కరించుకుని మదన మోహనుడు వత్సచరణ అలంకరణలో ఆదివారం శోభిల్లాడు. చందన్ యాత్ర ఐదవ రోజు సందర్భంగా జగన్నాథుని ప్రతినిధిగా మదన మోహనుడు వత్సచరణ అలంకరణలో దర్శనమిచ్చాడు. యాత్రలో భాగంగా నరేంద్ర పుష్కరిణిలోని చందన వేదిక వద్ద స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు.

ముగిసిన కళింగ వైశ్య యువకుల ఉపనయనాలు


ఉపనయనం పొందుతున్న యువకులు

కొరాపుట్: కళింగ వైశ్య యువకుల సామూహిక ఉపనయనాలు శనివారం ఘనంగా ముగిశాయి. జయపూర్ పట్టణంలోని మహారాణిపేటలో గల వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ముగింపు కార్యక్రమం జరిగింది. అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన సుమారు 115 మంది యువకులు ఉపనయనాలు స్వీకరించారు. మధ్యాహ్నం మూడు వేల మందికి పైగా భక్తులకు పట్టణానికి చెందిన వూళ్ల వాసుదేవరావు ఉచితంగా విందు భోజనాలు వితరణ చేశారు. అతని కుమారుడు అంకిత్ కుమార్ కూడా ఉపనయనం పొందడంతో భోజన వితరణ చేసినట్లు వెల్లడించారు.


గోశాలలో దూరిన చిరుత పులి


గోశాలలో దూడపై దాడి చేస్తున్న చిరుత పులి

కొరాపుట్: రాష్ట్ర సరిహద్దులోని గోశాలలో చిరుత పులి దూరి భయందోళన కలిగించింది. ఆదివారం వేకువ జామున నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితికి పక్కనే ఉన్న చత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా తెల్కాబెడ గ్రామంలో ఒక గోశాలలో చిరుత పులి ప్రవేశించింది. దాంతో ఆవులు పెద్ద ఎత్తున అరుపులు పెట్టాయి. అనుమానంతో గ్రామస్తులు నిద్ర లేచి సెల్‌ఫోన్ల వెలుగులో చూడగా గోశాల లో చిరుత కనిపించింది. వెంటనే గ్రామస్తులు ఆయుధాలతో దాడికి ప్రయత్నించగా చిరుత సమీప అడవిలోకి పారిపోయింది. ఉదయం అటవీ శాఖ అధికారులు వచ్చి పరిస్థితి సమీక్షించారు.

ఎలుగుబంట్ల అలజడి..

- ఇద్దరిపై దాడి


అడవిలోనికి పారిపోతున్న ఎలుగుబంటి

కొరాపుట్: కొరాపుట్ జిల్లా గొడపొదర్ గ్రామ పంచాయతీలోకి మూడు ఎలుగుబంట్లు ఆదివారం చొరబడ్డాయి. హర్దలి గ్రామ మార్గంలో సమీప అటవీ ప్రాంతం నుంచి గొడపొదర్ గ్రామంలోకి ప్రవేశంచిన భల్లూకాలు పార్వతీ పరజ అనే మహిళపై దాడి చేయగా ఆమె హాహాకారాలు చేసింది. గ్రామస్తులు అప్రమత్తమై ఎదురు దాడుల చేయగా అవి పరుగులు తీసి ఇదే పంచాయతీ చత్రిపుట్ గ్రామం లోనికి ప్రవేశించి నిసాయి హరిజన్ అనే వ్యక్తిపై దాడి చేశాయి.అక్కడ కూడా గ్రామస్తులు అతనిని రక్షించారు. ఎలుగు బంట్లు తిరిగి అడవి లోనికి వెళ్లిపోయాయి. క్షతగాత్రులను జయపూర్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు రిఫర్ చేశారు.

అత్తపై పెట్రోల్ పోసి కాల్చిన కోడలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల యంవీ 18 గ్రామంలో ఆదివారం కోడలు అత్తపై పెట్రోల్ పోసి కాల్చేసింది. గ్రామంలో ఉంటున్న రేణుక వైద్య అనే మహిళలపై ఆమె కోడలు జయ పెట్రోల్ పోసి కాల్చేసింది. రేణుక కేకలు విన్న ఇరుగు పొరుగు వారు వచ్చి ఆమెను రక్షించి మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె కుమారుడు అభినాష్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. 60 శాతం కాలిపోవడంతో క్షతగాత్రురాలిని మెరుగైన వైద్యం కోసం చత్తీస్‌గఢ్ తరలించారు.

వస్తున్నాయ్ వస్తున్నాయ్..
జగన్నాథ రథ చక్రాల్..


బొడొ దండొలో పందిరి ఛాయలో కొనసాగుతున్న రథాల తయారీ పనులు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని యాత్ర కోసం రథాల తయారీ చురుగ్గా సాగుతోంది. వడదెబ్బ తాకిడి నుంచి జాగ్రత్త వహిస్తూ ఈ పనుల్లో కార్మికులు నిరవధికంగా పాల్గొంటున్నారు. ఉదయం 8 గంటల నుంచే పనులకు హాజరవుతున్నారు. కార్మికులపై ఒత్తిడి తగ్గించే దిశలో పనులు పుంజుకుంటున్న కొద్దీ కార్మికుల సంఖ్యని పెంచుతున్నారు. గడిచిన 3 రోజుల్లో రథ చక్రాల తుంబల తయారీలో వడ్రంగి (మహరణ) కార్మికులు తలమునకలై ఉన్నారు. ఈ దశ పనుల్లో రంపం కార్మికుల పాత్ర కీలకం. కోతకు వీలుగా భారీ దుంగల్ని చెక్కి తుంబల తయారీకి అనుకూలంగా మలచి ప్రధాన వడ్రంగి సేవకులకు అందజేస్తున్నారు. ఈ పనుల కోసం నియమితులైన 26 మంది వడ్రంగి (మహరణ) సేవకులు, నలుగురు రంపం కార్మికులు, ఆరుగురు కమ్మరి కార్మికులు, 14 మంది బోయి సేవకులు, ఒక సహాయకునితో మొత్తం 51 మంది కార్మికులు మూడు రథాలకు అవసరమైన 42 తుంబల తయారీ పనులు ప్రారంభించారు.


తుంబల కోసం సిద్ధం చేసిన దుంగలు

జగన్నాథుని రథోత్సవానికి సన్నాహాలు

- మహంతులతో ఎస్పీ సమావేశం

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని రథా యాత్ర కోసం అనుబంధ యంత్రాంగం ఒక్కొటిగా సిద్ధం అవుతుంది. ఈ క్రమంలో పోలీసు యంత్రాంగం ముందంజలో ఉంది. యాత్ర పురస్కరించుకుని అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు విభాగం ప్రధానంగా జాగ్రత్త వహిస్తుంది. ఈ నేపథ్యంలో అనుబంధ వర్గాల్లో క్రమశిక్షణ ప్రేరేపించి అవసరమైన సహాయ సహకారాలు సకాలంలో అందజేయాలని అభ్యర్థిస్తుంది. స్వామి యాత్ర నిర్వహణలో స్థానిక మఠాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ మఠాల అధిపతుల ఆధ్వర్యంలో యాత్ర కార్యకలాపాలు నిర్విఘ్నంగా సకాలంలో నిర్వహించేందుకు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పూరీ పట్టణ వ్యాప్తంగా శ్రీ జగన్నాథుని సంస్కృతితో ముడి పడిన మఠాల మహంతలతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల ముగిసిన తొలి సమన్వయ కమిటి సమావేశం తీర్మానాలపై అవగాహన కల్పించారు.


సమావేశంలో పాల్గొన్న ఎస్పీ తదితరులు

• ఎండే అండ



విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

- రాజ్‌భవన్‌లో సౌర విద్యుత్ వినియోగానికి ఏర్పాట్లు
- ఈవీల వినియోగంపైనా కసరత్తు

భువనేశ్వర్: స్థానిక రాజ్ భవన్ రాష్ట్రంలోనే మొట్టమొదటి నికర జీరో ఎనర్జీ క్యాంపస్‌గా అవతరించే దిశగా అడుగులు వేస్తోంది. గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి దృఢ సంకల్పంతో నడుం బిగించారు. స్వచ్ఛమైన, స్వదేశీ ఇంధన వనరులతో పూర్తి స్థాయి సౌర విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ వాహనాల వినియోగానికి శ్రీకారం చుట్టారు. రాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ఆయనతో విద్యుత్ శాఖ బాధ్యతలు వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ కూడా పాల్గొన్నారు. రాజ్ భవన్‌లో 150 కిలో వాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని, మరో 400 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. మరో వైపు విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రేరేపిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాజ్ భవన్ విద్యుత్ వాహనాలు (ఈవీ) కొనుగోలు ప్రారంభించిందని ప్రకటించారు.

అన్ని స్థాయిల్లో సంప్రదాయ విద్యుచ్ఛక్తి వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ చొరవ చేపట్టారు. 4 విద్యుత్ వాహనాలను రాజ్ భవన్ ఫ్లీట్‌కు చేర్చారు. రాజ్ భవన్ క్యాంపస్‌లో పర్యావరణ అనుకూల చలనశీలతకు మద్దతు ఇవ్వడానికి కార్ల నుంచి ద్విచక్ర వాహనాల వరకు మేడ్ ఇన్ ఇండియా విద్యుత్ వాహనాలను కొనుగోలు చేశారని గవర్నర్ విలేకరులకు తెలిపారు. ఒడిశా రాజ్ భవన్ విద్యుత్ బిల్లు ప్రస్తుతం నెలకు 3 లక్షల రూపాయలు. త్వరలో అది సున్నాకి తగ్గుతుందని గవర్నరు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీని అవలంబించాలని గవర్నర్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ యోజన కింద మంజూరు చేస్తున్న సబ్సిడీల ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ (హరిత విద్యుత్) వినియోగాన్ని ప్రోత్సహించడానికి అదనపు సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి ఇంధన భద్రతను ప్రోత్సహించడం పచ్చదనం, ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను స్వీకరించడానికి ఈ నిర్ణయాత్మక చర్యగా నిలుస్తాయన్నారు. విద్యుత్ శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, హరిత విద్యుత్ వినియోగాన్ని ప్రాచుర్యం పొందడంలో గవర్నర్ కీలక పాత్ర పోషించడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ భవనాలకు సౌరశక్తి నుంచి విద్యుత్‌ను అందించే విధానాన్ని అవలంబించిందని మంత్రి అన్నారు. ఈ విధానం ఇటీవలే ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, క్వార్టర్లలో సౌర విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ యోచిస్తోంది. పునరుత్పాదక శక్తితో నడిచే ఎయిర్ కండిషన్‌లు ఇతర పరికరాలను ఏర్పాటు చేసేందుకు విభాగం కృషి చేస్తుందని కనక వర్ధన్ సింగ్‌దేవ్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు విద్యుత్ వాహనాలను ఉపయోగించడం ప్రోత్సహించేందుకు త్వరలో ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశ పెడుతుందని మంత్రి తెలిపారు.

ఫ్లై ఓవర్ నుంచి ట్యాంకర్ బోల్తా


ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి కిందకు పడిన భారీ ట్యాంకర్

రాయగడ: కొరాపుట్ నుంచి వస్తున్న ఒక భారీ ట్యాంకర్ స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో బ్రిడ్జి కింద చేపలు, కూరగాయాలు విక్రయించే వారుంటారు. మధ్యాహ్నం కావడంతో అంతా దుకాణాలను మూసివేసి వారి వారి ఇళ్లకు వెళ్లిపోయారు. లేదంటే పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవించి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలియజేశారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

ప్రమాదం జరిగిందిలా..

కొరాపుట్ నుండి వస్తున్న భారీ ట్యాంకర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఒక స్కూటీని ఢీకొంది. అతివేగంతో వస్తున్న ట్యాంకర్ వల్ల ప్రమాదం సంభవిస్తుందని ముందుగా పసిగట్టిన స్కూటీ డ్రైవరు తను నడుపుతున్న స్కూటీని విడిచి గెంతివేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్కూటీని సరాసరి ఢీకొన్నాక ట్యాంకర్ స్టీరింగ్ అదుపు తప్పడంతో బ్రిడ్జి మలుపు వద్ద సెక్యూరిటీ వాల్స్‌ను ఢీకొని సరాసరి 25 అడుగుల ఎత్తు నుంచి ట్యాంకర్ కింద పడింది. ప్రమాదం సంభవించిన వెంటనే డ్రైవరు సంఘటన స్థలం నుంచి పరారయ్యారు.

సహాయక చర్యలు

ప్రమాదం జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు ఆపారు. బ్రిడ్జి కింద పడి ఉన్న ట్యాంకర్ వద్ద అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలను చేపట్టారు. ముందుగా ట్యాంకర్ కు సంబంధించిన డీజిల్ ట్యాంక్ నుండి డీజల్ కారుతుండటంతో ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవించకుండా ట్యాంక్ నుంచి డీజిల్‌ను తీసివేశారు.

నిబంధనలకు తిలోదకాలు

నిత్యం జన సమూహంతో రద్దీగా ఉండే రాయగడ పట్టణంలో భారీ వాహనాలు లోపలకు ప్రవేశించ కూడదని, బైపాస్ వైపు వాటిని మళ్లించాలని కలెక్టర్ ఫరూల్ పట్వారి గత కొద్ది రోజుల కిందట ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఈ చర్యలు చేపట్టారు. అయితే మిట్ట మధ్యాహ్నం భారీ వాహనం పట్టణం లోపలకు ఎలా ప్రవేశించిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు ఏర్పాటు చేసిన వందకు పైగా ఉన్న నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) పర్యవేక్షిస్తున్న పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుందని కాంగ్రెస్ నాయకుడు భూషణ మాజి ఆరోపించారు.

బైక్ దొంగ అరెస్టు


పోలీసులకు చిక్కిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న వాహనం

రాయగడ: బైకు దొంగతనం కేసులో నిందితుడిని సదరు పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వ్యక్తి స్థానిక న్యూ కాలనీకి చెందిన పి.సురేష్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడుని కోర్టుకు తరలించారు. ఐఐసీ కేకేబీకే కుహరో తెలియజేసిన వివరాల ప్రకారం .. గత ఏప్రిల్ 28వ తేదిన న్యూకాలనీలో ఓ వ్యక్తి బైకు చోరీకి గురైంది. దీంతొ బాధితుడు సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని స్థానిక నాగావళి సమీపంలో శనివారం అరెస్టు చేశారు.

క్రేన్ ప్రమాదంపై త్రిసభ్య కమిటీ


విరిగిన క్రేన్


కుప్ప కూలిన వంతెన

భువనేశ్వర్: కటక్ ఖాన్ నగర్ ప్రాంతం రింగ్ రోడ్ వంతెన స్లాబ్ కూలి ముగ్గురు చనిపోయిన ఘటనపై ప్రత్యేక బృందం దర్యాప్తునకు ఆదేశించింది. ఈ విషాద సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కటక్ ఖాన్ నగర్ ప్రాంతంలోని కఠొజొడి నదిపై వంతెన పనులు జరుగుతుండగా కొన్ని భారీ కాంక్రీట్ స్లాబ్‌లను ఎత్తుతున్న క్రేన్ ప్రమాదవశాత్తు కూలిపోయింది. క్రేన్ కింద పని చేస్తున్న కార్మికులు స్లాబ్‌ల కింద నలిగిపోయారు.

త్రిసభ్య కమిటీ దర్యాప్తు

సంఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. కటక్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ దివ్యజ్యోతి స్మృతి రంజన్ దేవ్ ఆధ్వర్యంలో త్రిసభ్య బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ కమిటీలో డిప్యూటీ కలెక్టర్, రహదారులు, వంతెనల విభాగం (ఆర్ అండ్ బి) సూపరింటెండెంట్ ఇంజినీరు, జిల్లా కార్మిక అధికారితో కూడిన ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఈ సంఘటనపై ఆదివారం దర్యాప్తు ప్రారంభించిన బృందం 7 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పిస్తుందని తెలిపారు.

వాతావరణం

- గాలివానల బీభత్సం
- మరో 3 రోజులు పొంచి ఉన్న కాలవైశాఖి

భువనేశ్వర్: రాష్ట్రంలో వాతావరణ మార్పు భయపెడుతోంది. కొద్ది రోజులుగా నిరవధికంగా రాష్ట్ర వ్యాప్తంగా అసాధారణ వాతావరణం కనిపిస్తోంది. నిత్యం సంధ్య వేళలో గాలి వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కాలవైశాఖి వర్షాలు ఒడిశాలో విధ్వంసం సృష్టిస్తున్నాయి. మరో 3 రోజులపాటు రాష్ట్రంలో కాల వైశాఖి వాతావరణం పొంచి ఉన్నందున ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఐఎండీ అసాధారణ వర్ష సూచన జారీ చేసింది. కాలవైశాఖి పేరుతో తాండవిస్తున్న తుఫాను ఎక్కడికక్కడ పలువురి ప్రాణాల్ని పొట్టన బెట్టుకుంది. వృక్షాల్ని కుప్ప కూల్చి భారీ విద్యుత్ స్తంభాల్ని నేలకొరిగించింది. దీంతో సాధారణ జన జీవనం స్తంభించింది.

చెట్టు కూలి మహిళ దుర్మరణం

అంగుల్ జిల్లా కొణిహా మండలం పరిధిలోని బొడొ గుండురి గ్రామ పంచాయతీ పరిధిలోని దేభుంయి గ్రామంలో కాలవైశాఖి విషాదం మిగిల్చింది. ఈ ప్రాంతంలో గుల్మోహర్ చెట్టు కూలి ఆ మార్గంలో నడుస్తున్న తల్లీ బిడ్డలపై పడింది. ఈ విపత్తులో తల్లి ఘటనా స్థలంలో మృతి చెందగా బిడ్డకు తృటిలో ప్రాణ ముప్పు తప్పింది.

పాడి పశువు దుర్మరణం

కటక్ జిల్లా నియాలి పోలీస్ ఠాణా పరిధిలోని కృష్ణ ప్రసాద్ పంచాయతీ నువాబెటెండా గ్రామంలో కాల వైశాఖి తుఫాను సమయంలో తాటి చెట్టు కూలిపోవడంతో కునిలత సాహు అనే మహిళ ఘటనా స్థలంలో మృతి చెందింది. శాల నుంచి ఆవును తీసుకు వస్తుండగా చెట్టు ఇద్దరిపైనా పడిపోయింది. దీంతో అక్కడికక్కడ ఆవు, మహిళ మృతి చెందారు.

నారింజ, పసుపు హెచ్చరికలు

వాతావరణ శాఖ అంచనా ప్రకారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో 3 రోజుల పాటు కాల వైశాఖి వాతావరణం తాండవిస్తుంది. దీని ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆయా జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం నారింజ, పసుపు రంగు హెచ్చరికలను జారీ చేసింది.


ఈదురుగాలులతో విరిగిన భారీ విద్యుత్ స్తంభం


అంగుల్‌లో నేలకొరిగి మహిళ ప్రాణాల్ని పొట్టనబెట్టుకున్న చెట్టు

నారింజ రంగు హెచ్చరిక

వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం.. మయూర్‌భంజ్, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉపరితల గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలో మీటర్లకు చేరుకుంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.


నగరంలో అసాధారణ వర్షం

పసుపు హెచ్చరిక

బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి రాయగడ, నవరంగపూర్, కెంఝుహర్, అంగుల్, ఢెంకనాల్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. ఉపరితల గాలి వేగం గంటకు 30 నుంచి 40 కిలో మీటర్లు వరకు ఉంటుంది.

రేపటికి..

నారింజ హెచ్చరిక: మయూర్‌భంజ్, కెంఝుహర్, బాలాసోర్, భద్రక్ మరియు గజపతి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వడగళ్లతో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పసుపు హెచ్చరిక: జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, సుందర్‌గఢ్, అంగుల్, ఢెంకనాల్, రాయగడ, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల మధ్యాహ్నం, సాయంత్రం వేళలో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన, గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వరకు వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

వైద్యుని ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇల్లు

రాయగడ: స్థానిక కస్తూరీనగర్‌లో నివాసముంటున్న డాక్టర్ బి.ఎల్.ఎన్.పృష్టి ఇంట్లో చోరీ జరిగింది. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి పదివేల రూపాయల నగదు, ఒక చేతి గడియారాన్ని దొంగిలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సదరు పోలీస్ స్టేషన్ ఐఐసీ కేకేబీకే కుహారో తెలియజేసిన వివరాల ప్రకారం.. గత కొద్ది నెలల క్రితం డాక్టర్ పృష్టి తన కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లో దొంగతనం చేశారు. ఆదివారం ఉదయం ఇరుగుపొరుగు వారు డాక్టర్ ఇంటి తలుపులు తెరిచిఉండటం చూసి అతని కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ పృష్టి ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు.

9 మంది ఓఏఎస్ అధికారుల బదిలీ

భువనేశ్వర్: రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ శాఖ తొమ్మిది మంది ఓఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం కటక్ డిప్యూటీ కలెక్టర్‌గా సుజయ్ కుమార్ పట్టి, హిందోల్ డిప్యూటీ కలెక్టర్‌గా దుర్యోధన్ సాహు నియమితులయ్యారు. నియాలీ తహసీల్దార్‌గా తరిణి రంజన్ రే, జగత్‌సింగ్‌పూర్ తహసీల్దార్‌గా అజయ్ కుమార్ మహంతి, ఘుటొగాంఫ్ తహసీల్దార్‌గా చారులతా సింగ్, హట్టొడిహి తహసీల్దార్‌గా శిబొబ్రొతొ త్రిపాఠి, సహరపాడా తహసీల్దార్‌గా లీలాబతి నాయక్, పట్న తహసీల్దార్‌గా అశ్విని కుమార్ నాయక్, స్థానిక ఆర్ పీఆర్‌సీ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా సాయి సస్మితహోత్తా నియమితులయ్యారు.

క్లుప్తంగా

యువకుని దారుణ హత్య



చైతన్య మృతదేహం వద్ద పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విక్రమ్‌పూర్‌లో శనివారం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడిని విక్రమ్‌పూర్ గ్రామానికి చెందిన చైతన్య సబర్(48)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు. శనివారం నాడు సబర్ ఇంటిలో మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో పొరుగింటిలో నివసిస్తున్న పొండ సబర్ అనే యువకుడు గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రగాయాలకు గురైన చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం దాడి చేసిన పొండా సబర్ పద్మపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతుని భార్య మేలుని సబర్ తన భర్తను పొండ సాబొరొతొ పాటు అతని కొడుకు కూడా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి అరెస్టు



నిందితుడు దేవజిత్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోలీసులు ఆదివారం 80 లక్షలు మోసం చేసిన దేవజీత్ త్రిపాఠి ని అరెస్టు చేశారు. దేవజీత్ త్రిపాఠి అనే వ్యక్తిపై మల్కన్‌గిరి జిల్లాకు చెందిన కె.జితేంద్ర పాత్రో అనే వ్యక్తి మల్కన్‌గిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవజీత్ జిల్లాలో పండ్ల వ్యాపారం చేస్తున్న జితేంద్రతో పరిచయం చేసుకుని 2017లో అతని నుంచి కమొడిటీ ట్రేడింగ్ చేస్తే మూడు నేలల్లో 20 శాతం లాభం వస్తుందని నమ్మించి కొంత డబ్బులు కట్టించి లాభం ఇచ్చాడు. మరి కొంత ఆశ చూపి విడతల వారిగా రూ.40 లక్షలు డబ్బులు కట్టించి ఏటు వంటి లాభలు ఇవ్వలేదు. జితేంద్ర వెంటనే దేవజిత్‌కు ఫోన్ చేసి డబ్బులు ట్రేడింగ్ ఖాతా వివరాలు చేప్పకుండా రూ. 22లక్షలు కట్టించాడు. మారో కొత్త ఖాతా ఓపెన్ చేయాలని నమ్మించాడు. ఆదార్ కార్డ్, ఇతర కార్డులు తీసుకొని మారో ఖాతా ఓపెన్ చేయాలని, రూ.10 లక్షలు కావాలని చేప్పి మొత్తం 80 లక్షలు వరుకు తీసుకుని పారారయ్యాడు. అతను ఈ విషయం తెలుసుకున్న జితేంద్ర కొద్ది రోజుల క్రితం ఫిర్యాదుతో బార్‌గాడ్‌లో అరేస్టు చేసి మల్కన్‌గిరికి తరలించారు. ఇక్కడ విచరణ అనంతరం సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని మల్కన్‌గిరి పోలీసులు తెలిపారు.

ఉద్యాన పంటలకు రాయితీ రెట్టింపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో 44250 హెక్టార్లలో ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా 155147 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని రైతులు సాధిస్తున్నారని జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘ తీరప్రాంతమున్న, వివిధ జీవవైవిధ్య పరిస్థితులు నెలకొని ఉన్న జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక విస్తరణ పథకాలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ సంవత్సరం నుంచి ప్రోత్సాహకాలను గణనీయంగా పెంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ పంటలను వేయదలుచుకునే రైతులను ఉద్యాన అధికారులు గుర్తించారని, తొలకరి వర్షాకాలానికి ముందే మిగిలిన రైతులని కూడా గుర్తించేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ పథకంలో ప్రత్యేకంగా డ్రాగన్ ఫ్రూట్ పంటకు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. గతంలో హెక్టారుకు రూ.30వేలుగా ఉన్న రాయితీని ఇప్పుడు రూ.1.62లక్షలకు పెంచడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రైతు సహాయక కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

దిఘాలో జగన్నాథ్ ధామ్ వివాదం



శ్రీ మందిరం సింహ ద్వారం థాణా ఆవరణలో జగన్నాథ సేన కార్యకర్తలు

- రామకృష్ణ దాస్ మహాపాత్రోకు తాఖీదు జారీ

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ ఆలయం సీనియర్ దైతపతి రామకృష్ణ దాస్‌మహాపాత్రో పశ్చిమ బెంగాల్‌లో చేసిన వ్యాఖ్యలు నిప్పు రాజేశాయి. దీంతో ఆదివారం వివాదాస్పద సీనియర్ దైతపతి రామకృష్ణ దాస్‌మహాపాత్రోని ముఖాముఖి ప్రశ్నించేందుకు ఆలయ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుదీర్ఘంగా దైతపతిని ప్రశ్నించిన మేరకు ఆలయ ప్రధాన నిర్వాహకుడు సీఏఓ దైతపతి రామకృష్ణ దాస్ మహాపాత్రోకు తాఖీదు జారీ చేశారు. తాఖీదు మేరకు సంతృప్తికర వివరణ దాఖలు చేయాలని ఆదేశించారు. తాఖీదు అందిన రోజు నుంచి 7 రోజుల లోపు వివరణ దాఖలు చేయాలని గడువు కల్పించారు. ఈ గడువులోపు సంతృప్తికరమైన వివరణ అందకపోతే శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1955 ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తాఖీదులో స్పష్టం చేశారు.

దిఘా ఆలయానికి జగన్నాథ్ ధామ్ అనే పదాన్ని ఉపయోగించడం పూర్తిగా తప్పని సేవాయత్‌ల వర్గం ఆవేదన వ్యక్తం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి అధికారికంగా తెలియజేయాలని ఛొత్తీషా నియోగుల వర్గం కోరింది. ముఖ్యమంత్రి స్వరాష్ట్రానికి చేరడంతో ఈ మేరకు చర్యలు చేపడతామని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ అభయం ఇచ్చారు. పూరీ జగన్నాథ ఆలయంలో మూల విరాటుల కొత్త విగ్రహాలను చెక్కడానికి నవకోబరం సమయంలో ఉపయోగించిన దైవిక వేప కలప – పవిత్రమైన 'దారు'ను అనధికారికంగా దిఘా ఆలయంలో విగ్రహాల తయారీకి వినియోగించినట్లు రామకృష్ణ దాస్ మహాపాత్రో పశ్చిమ బెంగాలు మీడియాతో ప్రతిస్పందనలో పేర్కొన్నారు. పవిత్రమైన కలపను దుర్వినియోగం చేసినట్లు రుజువు కావడంతో బాధ్యుల్ని గుర్తించి కఠినంగా శిక్షించాలని సర్వత్రా పట్టు బిగుసుకుంది.

పశ్చిమ బెంగాలు నుంచి రాష్ట్రానికి చేరిన తర్వాత స్థానిక మీడియాతో స్పందించిన రామకృష్ణ దాస్‌మహాపాత్రో ఈ ఆరోపణల్ని ఖండించారు. వేరొక వేప చెట్టు నుంచి సేకరించిన కలపతో విగ్రహాన్ని తయారు చేసి స్వయంగా ప్రతిష్టించానని వివరించారు. ఈ ద్వంద్వ వైఖరిని తొలగించి స్పష్టమైన వైఖరితో వివరణ దాఖలు చేయాలని శ్రీ మందిరం సీఏఓ ఆది వారం తాఖీదులు జారీ చేశారు. రామకృష్ణ దాస్ మహాపాత్రో పాటు దైతపతి నియోగుల సంఘం అధ్యక్షుడు గణేష్ దాస్ మహాపాత్రో కూడా విచారణకు హాజరయ్యారు. అధికార వర్గం నుంచి శ్రీ మందిరం సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢితో ఆలయ సేవా విభాగం అధికారి జితేంద్ర కుమార్ సాహు హాజరు అయ్యారు.

పోలీసు థాణాలో పలు ఫిర్యాదులు

ఈ వివాదంలో రోజుకో ఫిర్యాదు పోలీసు థాణాలో దాఖలు అవుతున్నాయి. శ్రీ మందిరం సింహ ద్వారం థాణాలో ఈ ఫిర్యాదులు దాఖలు అవుతున్నాయి. శ్రీ మందిరంలో పదిలంగా ఉండాల్సిన పవిత్ర కలప అడ్డకోలుగా రాష్ట్రం దాటి వెళ్లిపోతుందని ఈ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ వ్యతిరేకంగా కూడ థాణాలో ఫిర్యాదు దాఖలు అయినట్లు అనధికారిక వర్గాల సమాచారం. శ్రీ మందిర మేఘ నాథ్ ప్రహరి లోపల భద్రంగా ఉండాల్సిన అమూల్య సామగ్రిని దైతపతి నియోగుల సంఘం కార్యదర్శి రామకృష్ణ దాస్ మహాపాత్రోపై జగన్నాథ సేన కార్యకర్తలు సింహ ద్వారం థాణాలో పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్

సింహ ద్వారం పోలీస్ థాణాలో దైతపతి నియోగుల సంఘం కార్యదర్శి పేరిట ఆన్‌లైన్‌లో ఒక ఫిర్యాదు నమోదైందని సమాచారం. పూరీలోని సత్య నగర్ ప్రాంతానికి చెందిన సమాచార హక్కు కార్యకర్త జయంత్ కుమార్ దాస్ ఈ ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పూరి శ్రీ మందిరం పాలక మండలి అనుమతి లేకుండా దైతపతి నియోగుల సంఘం కార్యదర్శి రామకష్ణ దాస్ మహాపాత్రో నవకలేబర మిగులు దారు (కలప)ను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి విక్రయించారని ఎఫ్ఐఆర్ జయంత్ కుమార్ ఆరోపించారు. ఈ చర్యలు ఆధారంగా రామకృష్ణ దాస్ మహాపాత్రో వ్యతిరేకంగా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేయాలని జయంత్ కుమార్ దాస్ పేర్కొన్నాడు.



సీఏఓ అధ్యక్షతన అత్యవసర సమావేశం



రామకృష్ణ దాస్ మహాపాత్రో, వివాదస్పద దైతపతి

ఎనిమిదేళ్ల విద్యార్థినిపై అఘాయిత్యం



మీడియా ముందు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మీనాక్షి బాహిణి పతి, మహిళా కాంగ్రెస్ నాయకులు

- ఆశ్రమ పాఠశాలలోనే లైంగికదాడి
- భగ్గుమన్న రాజకీయ పార్టీలు

కొరాపుట్: జిల్లాలోని లమ్తాపుట్ సమితి గున్నుయిపుట్ భగ్గుమంది. ఇక్కడి ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదేళ్ల విద్యార్థినిపై లైంగికదాడి జరిగినట్లు ఆలస్యంగా వెలుగు చూడడంతో రాజకీయ నాయకులు గ్రామానికి తరలివచ్చారు. ఏప్రిల్ 13న అర్ధరాత్రి గుర్తు తెలియని అగంతకుడు ఆశ్రమ పాఠశాలలోనే బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం తెలిసిన ప్రధానోపాధ్యాయురాలు భానుప్రియ రహస్యంగా ఉంచారు. 30న స్కూల్‌కు సెలవులు రావడంతో బాలిక ఇంటికి వచ్చింది. రక్తం మరకలు చూసి తల్లి ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పింది. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిశీలించిన డాక్టర్ ఇది అత్యాచారమని పోలీసులకు సమాచారం ఇస్తే గానీ వైద్యం చేయలేనని చెప్పాడు. దీంతో బాధితులు మాచ్‌ఖండ్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు ఫిర్యాదు చేశారు.

ఈ విషయం బయటకు తెలియడంతో ప్రజలు భారీ ఆందోళనలు చేపట్టారు. దీంతో అధికారులు స్పందించి దారుణాన్ని దాచిపెట్టిన హెచ్‌ఎంను సస్పెండ్‌చేశారు. ఘటన జరిగిన ప్రాంతం కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్ స్వగ్రామం ఉన్న పంచాయతీ కావడం విశేషం. అంతేకాక ఘటన జరిగిన రోజు గ్రామంలో ఉత్సవం జరిగిందని, ఆ ఉత్సవంలో ఎమ్మెల్యే తన సహచరులతో కలసి పాల్గొన్నారని బీజేడీకి చెందిన మాజీ ఎమ్మెల్యే రఘురాం పొడాల్ ఆరోపించారు.

తరలి వెళ్లిన రాజకీయ పక్షాలు

ప్రతి పక్ష బీజేడీకి చెందిన రాజకీయ ప్రముఖులు బాధిత బాలిక ఇంటిని సందర్శించారు. 24 గంటలలో నేరస్తులను అరెస్ట్ చేయకపోతే రోడ్లపైకి వస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మెహన్ మాఝి ప్రభుత్వం వచ్చాక 160 మందికి పైగా అత్యాచారానికి గురయ్యారని తెలిపారు. తక్షణం సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై అవగాహన

కొరాపుట్: వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై బీజేపీ నాయకులు ఆదివారం ర్యాలీ చేపట్టారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు భారీగా పాల్గొన్నాయి. ప్రతీ ఏడాది వివిధ ఎన్నికల వలన వందకు పైగా రోజులు కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఉంటున్నాయన్నారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో బీజేపీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు శివ ముదలి, మాజీ అధ్యక్షుడు బిజయ్ మిశ్ర, తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం



దండకారణ్యంలో సమావేశమైన గిరిజనులు

కొరాపుట్: మీనాక్షి హైడ్రో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా గిరిజనులు ఉద్యమానికి సిద్ధమయ్యారు. కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి రామగిరి, దండాబడి గ్రామ పంచాయతీలకు చెందిన 19 గ్రామాల గిరిజనులు దండకారణ్యం పుజారి పుట్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ ప్లాంట్ యాజమాన్యం మొదటి ప్లాంట్ నిర్మాణం తర్వాత నిబంధనలు ఉల్లఘించిందన్నారు. మీకాక్షి పవర్ ప్లాంట్ రెండు, మూడు ప్లాంట్‌ల నిర్మాణంలో ప్రభుత్వ అనుమతులు లేవన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే బదలిపాడ, అటల్‌గుడ, కుంబికారి, మాలిపాదర్ గ్రామాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. హైదరాబాద్‌కి చెందిన మీనాక్షి సంస్థ తెంతులిగుమ్మ వద్ద 25 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శబరి నది నీటిని వీనియోగిస్తుంది. తర్వాత రెండో ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకొని మూడవ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వెళ్తుంది. సారంగపల్లి వద్ద విద్యుత్ వైర్ల కోసం రాళ్లను పేల్చి అనేక చెట్లు నరికేశారు. ఇవేవి స్థానిక గ్రామాల ప్రజలకు తెలియదన్నారు. ఇటువంటి పనులకు గ్రామ సభ అనుమతి తప్పనిసరి ఉండాలన్నారు. మరోవైపు నిర్మాణం పూర్తయితే తమ గ్రామాలు మునిగిపోతాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కొరాపుట్ జిల్లా కలెక్టర్, జయపూర్ సబ్ కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. తమ గోడును పాలకులు 10 రోజుల్లో వినకపోతే ప్లాంట్ లోపలకి దూసుకువెళ్తామని గిరిజనులు తీర్మానించారు.

'నాగావళి'కి అడ్డుకట్ట సమంజసం కాదు

- జేకే పేపర్ మిల్‌పై యాజమాన్యంపై ఎమ్మెల్యే కద్రక ఆగ్రహం



నాగావళి నదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కద్రక, అతని అనుచరులు

రాయగడ: జిల్లాలోని సదరు సమితి పరిధిలో ఉన్న జేకే పేపర్ మిల్ యాజమాన్యం చందిలి మీదుగా ప్రవహిస్తున్న నాగావళి నదినీటిని అడ్డుకట్ట వేసి తన అవసరాలకు వినియోగిస్తున్న తరువాత వాటి వ్యర్థాలను తిరిగి నదిలోకి విడిచి పెట్టడం ఎంతవరకు సమంజసమని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక ధ్వజమెత్తారు. నాగావళి పరిసరాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగావళి నది నీటిపై దిగువన గల వందలాది గ్రామాలకు చెందిన ప్రజలు మంచినీటి కోసం ఆధారపడుతుంటారన్నారు. అయితే కొన్నాళ్లుగా జేకేపేపర్ మిల్ యాజమాన్యం తన అవసరాల కోసం నది వద్ద ఇసుక బస్తాలను వేసి నీటిని నిలిపి వేస్తుండటంతో దిగువ ప్రాంతాల్లో గల వారికి తాగునీటి సమస్య తలెత్తుతుందని అన్నారు. కాగా కాస్త విడిచి పెడుతున్న నది నీటిలో పేపర్ తయారీకి సంబంధించి వినియోగించిన కెమికల్స్‌ను, వ్యర్థాలను నదిలో విడిచి పెడుతుండటంతో నదినీటిపై ఆధారపడుతున్న గ్రామస్తులు అదే నీటిని తాగా వ్యాధులబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం అసెంబ్లీలో ఇదే విషయమై ప్రశ్నోత్తరాల్లో భాగంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. దీనికి సమాధానంగా సంబంధిత శాఖ మంత్రి వివరణ ప్రకారం.. ప్రవహించే నదినీటిని ఏ ప్రైవేటు పరిశ్రమలు, ఇతరులు నీటిని అడ్డగించి స్వప్రయోజనాలకు వినియోగించే అధికారం లేదని స్పష్టం చేశారని అన్నారు. కాని జేకేపేపర్ మిల్ యాజమాన్యం నాగావళి నదిలో ఇసుక బస్తాలను వేసి అత్యధిక శాతం నీటిని స్వప్రయోజనాలకు వినియోగిస్తుందని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పక్షం రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే నది వద్దే బాధిత గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు నదిలో పర్యటించిన ఎమ్మెల్యే కద్రక జేకేపేపర్ మిల్ యాజమాన్యం నాగావళి నది నీటిని ఎలా కట్టడి చేసి నిల్వ చేసుకుని స్వప్రయోజనాలకు వినియోగిస్తుందో ఆరా తీశారు.



అసెంబ్లీలో తాను ప్రస్తావించిన కాగితాన్ని చూపిస్తున్న కద్రక

రంగస్థల వేదిక త్వరలో ప్రారంభిస్తాం

- కలెక్టర్ బిజయ కుమార్ దాస్
- పర్లాకిమిడిలో రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం



రాష్ట్రస్థాయి నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో కళాకారులకు కొరత లేదని, నాటకాలు ప్రదర్శించేందుకు రంగస్థల వేదిక లేదని, త్వరలో బెత్తగుడ వద్ద నిర్మాణం పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో 11వ రాష్ట్ర స్థాయి నాటక మహోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ నాటక మహోత్సవాలకు ప్రఖ్యాత రంగస్థల నటులు అశోక్ కోరో, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్, పృథ్వీరాజ్, నిర్వాహకులు క్రియేటివ్ ఆర్ట్స్ నృసింహచరణ్ పట్నాయక్, కార్యదర్శి మనోజ్ పాడీ, ఆదర్శదాస్ తదితరులు ప్రసంగించారు. తొలి రోజు 'శేషో ఇచ్చా' (చివరి కోరిక) నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. ఈ నాటకానికి దర్శకత్వం మనోజ్ కుమార్ పాడి, నాట్యకారులు ప్రభాకర్ కోరో, సంగీతం రఘునాథ పాత్రో, సహదర్శకులు ఆదర్శదాస్ వ్యవహరించారు. ఈ నాటక ప్రదర్శనలు మూడు రోజుల పాటు సాగుతాయి.

వ్యాపారి అనుమానాస్పద మృతి



మరణించిన వ్యాపారి వూన నాగరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మూడు రోడ్ల కూడలిలో ఉన్న ఓ దుకాణం అరుగుపై విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడు స్థానిక వ్యాపారి వూన నాగరాజుగా గుర్తించి కుటుంబానికి తెలియజేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి



రోడ్డు సౌకర్యం కావాలని డిమాండ్ చేస్తున్న రైసింగి గ్రామస్తులు

- ఖర్చబడి నుంచి గోంగరికి రోడ్డు నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ పరిధి ఖర్చబడి గ్రామ పంచాయితీ గోబిందో మామిడితోట జంక్షన్ నుంచి గోంగరి గావ్ వయా బి.రైసింగి గ్రామానికి స్వాతంత్ర్య వచ్చి 76 ఏళ్ల గడిచినా రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు బాధపడుతున్నారు. రోజూ అయిదు కిలోమీటర్లు ఖర్చబడి గ్రామపంచాయితీకు నడకదారిన చేరుకుని అక్కడి నుంచి ఆటోల ద్వారా మోహానా బ్లాక్‌కు వెళ్లాల్సిందే. బి.రైసింగిలో గ్రామంలో 20 ఇళ్లు ఉన్నాయి. పాఠశాలలు, వైద్యం, రేషన్, బియ్యం నిత్యవసర సౌకర్యాలకు సైకిళ్లు, నడకదారిన ఖర్చబడి పంచాయతీకి చేరుకోవాలి. చీకటిపడితే ఖర్చబడి పంచాయతీ నుంచి భయంతో వెళ్లాల్సిందే. కనీసం ప్రధానమంత్రి సడక్ యోజనా పథకం కింద బి.రైసింగికి మంజూరు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనేకసార్లు జిల్లా కలెక్టర్‌కు రైసింగి గ్రామస్థులు విన్నపాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు అంటున్నారు. ఒకప్పుడు మావోయిస్టుల అడ్డాగా పేరొందిన ఖర్చబడిలో ఇప్పటికీ మూఢనమ్మకాలు ప్రజల్లో ఎక్కువగా ప్రబలుతోంది. వైద్యసౌకర్యం లేనందున పసర వైద్యం, సూది మందులు ఇచ్చే ఆర్‌ఎంపీ వైద్యానికి ఖర్చబడి, గోంగరి గావ్, బి.రైసింగి గ్రామస్తులు అలవాటు పడ్డారు. మోహనా బ్లాక్ అధికారులు ఖర్చబడి నుంచి బి.రైసింగికి పక్కా రోడ్డు వేయాలని డిమాండు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మోహనా బ్లాక్ బీడీవో రాజీవ్ దాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామని ఖర్చబడి సర్పంచ్ తెలిపారు.



ఖర్చబడి పంచాయతీలో బి.రైసింగి గ్రామం

ఘనంగా సిద్ధాంత సాహితీ సంస్థ రజతోత్సవం



రచయిత సురేంద్రనాథ్ సాహును సన్మానించిన కలెక్టర్ బిజయకుమార్ దాస్



రచయిత సురేంద్రనాథ్ సాహును సన్మానించిన కలెక్టర్ బిజయకుమార్ దాస్



'సిద్ధాంత' సాహితీ సంస్థ రజతోత్సవ సంచికను ఆవిష్కరించిన కలెక్టర్ బిజయకుమార్ దాస్, తదితరులు

పర్లాకిమిడి: సిద్ధాంత సాహితీ సంస్థ రజతోత్సవ వేడుకలు రాజవీధిలో విశ్వనాథ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, విశిష్ట అతిథిగా మాజీ వైస్ చాన్సలరు ప్రొఫెసర్ డాక్టర్ మన్మనాథ్ పాడీ, గౌరత అతిథిగా గుణుపురం సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహిత, బరంపురం విశ్వవిద్యాలయం ప్రాంతీయ డైరక్టర్ డాక్టర్ సిద్ధార్థ శంకర్ పాడీ, పూర్ణచంద్ర మహాపాత్రో తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా సిద్ధాంత వార్షిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పత్రికకు ఎడిటర్‌గా మహిళా కళాశాల ప్రొఫెసర్ కల్యాణీ మిశ్రా పత్రిక విశేషాల గురించి వివరించారు. నవరసామాజ్ రంగంలో విశేషంగా కృషిచేసిన రచయిత కవిసూర్యనగర్‌కు చెందిన డాక్టర్ సురేంద్రనాథ్ సాహును కలెక్టర్ సన్మానించారు. అనంతరం 'సిద్ధాంత' ప్రతిభా పురస్కారాలు రాయఘడ బ్లాక్ సర్పంచ్ (జలంగ్) లాబణ్య శోబర, తరిణీసేన్ దాస్ (చాందిపుట్), గుణుపురానికి చెందిన కృష్ణ శబర, ఫాల్గుణీ శోబోరో (గుణుపురం), గాయత్రీ శోబోరో (మరిచగుడ, పద్మపూర్ బ్లాక్), హారాబతీ గోమాంగో (పద్మపూర్), అమ్రిత్ పాణిగ్రాహి (పర్లాకిమిడి)లను సత్కరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డి.ప్రియాంక, వి.హిమగిరి ఆధ్వర్యంలో ఒడిస్సీ, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సంస్కృత విద్యాలయం విశ్రాంత ప్రిన్సిపాల్ అన్నపూర్ణాదేవి అధ్యక్షత వహించారు.

క్లుప్తంగా

గోపాలకృష్ణ మాస్టారుకు పురస్కారం



గోపాలకృష్ణ మాస్టారును సత్కరిస్తున్న తెలుగు వెలుగు సాహితీ సంస్థ సభ్యులు

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన పుర్లి గోపాలకృష్ణ మాస్టారును తెలుగు వెలుగు సాహితీవేదిక ఘనంగా సత్కరించింది. ఈ మేరకు శనివారం రాత్రి విశాఖపట్నంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ సాంస్కృతిక సేవా రంగంలో విశిష్టమైన కృషిచేసినందుకు గుర్తించి పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఈ పురస్కారం అందించిన తెలుగువెలుగు కార్యనిర్వాహక కమిటీకి ఆయన ధన్యవాదాలు తెలుపుతున్నామన న్నారు. గోపాలకృష్ణ మాస్టారుకు పురస్కారం రావడంపట్ల అంబకండి గ్రామస్తులతో పాటు మండల విద్యాశాఖాధికారులు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ దార అప్పలనర్సమ్మ, వైస్‌ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు అభినందించారు.

పెండింగ్ ఈ చలానాలపై ఎస్పీ సీరియస్

- చెల్లించని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశాలు



జిల్లావ్యాప్తంగా ఈ చలానాలు వసూలు చేస్తున్న సిబ్బంది

విజయనగరం క్రైమ్: జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాల వసూళ్లపై అధికారులు, సిబ్బంది సీరియస్‌గా దృష్టి పెట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. జిల్లావ్యాప్తంగా పోలీస్ సిబ్బంది, అధికారులతో ఆదివారం ఆయన సెట్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వాహనాల పెండింగ్ చలానాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహనాల తనిఖీలు నిర్వహించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆయా వాహనాలపై పెండింగ్ చలానాలు ఉన్నట్లయితే వాటిని వాహనదారులు చెల్లించేంతవరకు వెంటాడాలని ఎస్పీ ఈ సందర్భంగా సిబ్బందిని ఆదేశించారు. మోటార్ వాహనాల నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఈ చలానాలు విధిస్తున్నా చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల ఈ చలానాలు కుప్పలు, కుప్పలుగా పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. సిబ్బంది పెండింగ్ ఈ చలానాలపై దృష్టి పెట్టాలని ఆ చలానాలు చెల్లించకపోతే వెంటనే వాహనాన్ని సీజ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే వాహనాల తనిఖీ సమయంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు.ఇక ఎంవీ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ సిబ్బందిని ఆదేశించారు.

మహిళ దుర్మరణం



ఘటనా స్థలంలో సత్యవతి మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రంలోని సాలూరు వెళ్లే రూట్‌లో కర్రల మిషన్ సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన చలమల సత్యవతి(64) కొన్నేళ్లుగా అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు కొనుక్కుని చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజులాగానే ఆదివారం కూడా వేకువజామున 5 గంటల సమయంలో కూరగాయల మార్కెట్‌కు వెళ్తుండగా జాతీయ రహదారి నుంచి రెండు నిమిషాల్లో మార్కెట్‌కు వెళ్లే లింకు రోడ్డు దిగుతుందన్న సమయంలో సాలూరు నుంచి రామభద్రపురం వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం మితిమీరిన వేగంతో వచ్చి సత్యవతిని బలంగా ఢీ కొట్టి సుమారు 50 అడుగుల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. దీంతో ఆమె అక్కికక్కడే మృతిచెందింది. పోలీసులు దగ్గరలో ఉన్న సీసీటీవీ పుటేజీ ఆధారంగా ఢీ కొట్టిన వాహనాన్ని కనిపెడుతున్నారు. మృతురాలి కుమారుడు ఈశ్వరరావు, కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద భోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు. కుమారుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై రమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రబలిన జ్వరాలు

సీతంపేట: మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న దిగువద్వారబందం గ్రామంలో కొందరు గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రమైన జ్వరం రావడంతో కొత్తూరు పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయగా వైద్యాధికారులు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారించారు. జ్వర పీడితులైన సవర పార్వతి, సవరదాసు, సవర విజయ్‌లను శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. వీరికి ప్లేట్‌లెట్స్ కూడా తగ్గినట్టు తెలిసింది. కాగా గ్రామంలో మరో నలుగురు కూడా జ్వరాలతో బాధపడుతున్నట్టు సమాచారం.

అంతా ఆర్భాటమే..!

- ఆక్రమణలు తొలగించాలంటూ హడావుడి చేసిన అధికారులు
- కొందరి దుకాణాల దగ్గర తొలగింపు
- మిగతా వారివి తొలగించకపోవడంతో విమర్శలు
- అంతరరాష్ట్ర కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య
- రోడ్లను ఆక్రమించి వ్యాపారాల నిర్వహణ
- ఇరుకు రోడ్లతో పార్కింగ్ సమస్య



గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రధాన రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



మార్చి 27వ తేదీన ఆక్రమణలు తొలగించాలని, ఇంటియజమానులు, దుకాణదారులకు చెబుతున్న అధికారులు (ఫైల్)

రామభద్రపురం: కూటమి ప్రభుత్వంలో పాలకులదే కాదు అధికారులది కూడా అంతా ఆర్భాటమే అని ప్రజలకు స్పష్టమైంది. రామభద్రపురం మండలకేంద్రంలోని అంతర్‌రాష్ట్ర కూడలిలో నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య నియంత్రణే లక్ష్యంగా తహసీల్దార్, సీఐ, ఎస్సై, ఆర్‌అండ్‌బీ జేఈలు రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణలు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. స్థానిక గాంధీ బొమ్మ దగ్గర నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలోని టీబీఆర్ సినిమా హాల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు, దుకాణాదారులతో సమావేశమై ఆక్రమణల తొలగింపునకు సహకరించాలని కోరారు. వారాంతా ఆక్రమణల తొలగింపే మంచిదని ఒప్పుకున్నారు. దీంతో అధికారులు రోడ్డు ఎడ్జ్ నుంచి 15 నుంచి 20 మీటర్ల వరకు ఆక్రమణలు తొలగించాలని కొలతలు వేసి స్వతహాగా తీసేయాలని ఆదేశించారు. అయితే రోడ్డు వెడల్పు అయి వాహనాల రాకపోకలతో పాటు ట్రాఫిక్ సమస్యను అధిగిమించవచ్చన్న ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. ఆక్రమణల తొలగింపు ఆరంభశూరత్వంలా మారి మున్నాళ్ల ముచ్చటగా మిగిలింది. ట్రాఫిక్ సమస్య మాట అటుంచితే.. ఆక్రమణల తొలగింపు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అంతా హంగామా..

నెలరోజుల క్రితం ఆక్రమణల తొలగింపు అంటూ అధికారులు హంగామా చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగింపునకు గట్టి చర్యలు చేపట్టారు. పోలీసు అధికారులు హడావుడి చేస్తూ స్వతహాగా దుకాణాలు తొలగించకుంటే రాత్రివేళల్లో తామే జేసీబీతో తొలగిస్తామంటూ బెదిరించారు. ఆ హెచ్చరికలను చూసి భయపడి కొత్తలో కొందరు దుకాణాదారులు మాత్రమే ఆక్రమణలు తొలగించారు. మిగతావారి ఆక్రమణలు తొలగించకపోవడంలో అంతర్యమేమిటోనన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రోడ్డు ఆక్రమణల తొలగింపును అర్ధాంతరంగా ఆపివేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. తొలగిస్తే ఆక్రమణలన్నీ తొలగించాలి కానీ ఇలా సగంలోనే ఆపేయడంపై బాధితుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. ఇక ముందు రోడ్ల ఆక్రమణలు తొలగింపు ఉంటుందో? ఉండదోనన్న అయోమయంలో ప్రజలు ఊగిసలాడుతున్నారు.

తనిఖీలేవీ?

రోడ్డు పక్కన పెద్ద కట్టడాలతో పాటు దుకాణాలు ఏర్పాటు చేసే సమయంలో పార్కింగ్ స్థలాలను పంచాయతీ అధికారులు తనిఖీ చేయాలి. కానీ అనధికార దుకాణాల నిర్మాణ సమయంలో పంచాయతీ అధికారులు నోరు మెదపడం లేదు. దీంతో దుకాణాల యజమానుల ఇష్టానుసారమైంది. అద్దెల కోసం ఇంటి యజమానులు, దుకాణాదారులు కనీస పార్కింగ్ కోసం బెత్తెడు స్థలం కూడా వదలకుండా రోడ్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దుకాణదారులు పలు చోట్ల రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. చివరకు డ్రెయిన్లు సైతం వదలకుండా వాటిపైనే ఇళ్లు నిర్మించి దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిని అడ్డుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.అలాగే వస్తువుల కొనుగోలు కోసం దుకాణాలకు వెళ్లిన వాహనదారులు ప్రధాన రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. పోలీసులు నో పార్కింగ్ బోర్డులు పెట్టినా నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పీడక గంటల కొద్దీ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది.

పోలీసులు బాధ్యత తీసుకోవాలి



ఆక్రమణలు తొలగింపు బాధ్యత పోలీసులు తీసుకోవాలి. సీఐ, ఎస్సై, ఆర్ అండ్‌బీ జేఈతో కలిసి ప్రతి దుకాణానికి వెళ్లి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించాం. మూడు రోజుల్లో ఎవరికి వారు స్వతహాగా దుకాణాలు తొలగించకుంటే మేమే జేసీబీతో తలగిస్తామని పోలీసులు చెప్పారు. ఇప్పటికీ ఆయా యజమానులు ఆక్రమణలు తొలగించలేదు కాబట్టి పోలీసులే తొలగింపు చర్యలు చేపట్టాలి.

ఎ.సులోచనరాణి, తహసీల్దార్, రామభద్రపురం

తహసీల్దార్ నోటీసులు ఇవ్వాలి



రోడ్డు ఆక్రమణలు తొలగించాలని ఇంటి యజమానులు, దుకాణదారులకు తహసీల్దార్ నోటీసులు ఇవ్వాలి. ఆమె ఇవ్వకపోవడంతో తొలగించలేదు. తహసీల్దార్‌తో మాట్లాడి తొలగింపు చర్యలు చేపడతాం. తొలగించకుంటే ట్రాఫిక్ సమస్య తెలెత్తుతుంది. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా ఆక్రమణలు తొలగిస్తాం.

కె నారాయణరావు, సీఐ, బొబ్బిలి

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ పార్టీ కేంద్రకార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకం ఇలా ఉంది.

విభాగం	పేరు	నియోజకవర్గం
అంగన్వాడీ వింగ్ జనరల్ సెక్రటరీ	ఆర్. చైతన్య స్రవంతి	కురుపాం
రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పింఛనర్ల విభాగం	వైస్‌ప్రెసిడెంట్ పీవీఎస్ఎస్ సోమయాజులు	కురుపాం
రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పింఛనర్ల విభాగం సెక్రటరీ	కాగాన ప్రకాశం	పార్వతీపురం

వేసక్ 2025కు సురవరం వ్యక్తి ఎంపిక



బాసా మురళి



వియత్నాం వెళ్తున్న గ్రూప్‌లో మురళి (వెనుకన ఎడమ వైపు)

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామానికి చెందిన బాసా మురళి వియత్నాంలో ఈ నెల 5 నుంచి 14 వరకు జరగనున్న వేసక్ ఫెస్టివల్- 2025కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సిల్‌చర్‌లోని అస్సాం యూనివర్సిటీలో కళల ప్రదర్శన విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2017 నుంచి పనిచేస్తున్నారు. భారత్ నుంచి ఐసీసీఆర్(ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్) నుంచి ఢిల్లీకి చెందిన పూర్ణిమా రాయ్ కథక్ గ్రూప్ ఈ ఫెస్టివల్‌లో నృత్య ప్రదర్శన ఇవ్వనుంది. ఈ గ్రూపునకు మురళి సాంకేతిక సహకారం కోసం ఎంపికయ్యారు. పూర్ణిమా రాయ్ కథక్ గ్రూప్ గౌతమ బుద్ధుడి జీవితంలో వివిధ ప్రధాన ఘట్టాల ఆధారంగా, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నృత్యరూపకాన్ని రూపొందించగా, ఆ నృత్య రూపకాన్ని మురళి సాంకేతిక సహకారంతో క్రియాత్మకంగా తీర్చిదిద్దారు. మొత్తం 14 మంది సభ్యులతో ఆయన ఆదివారం ఢిల్లీ నుంచి వియత్నాం బయలు దేరి వెళ్లారు.

విదేశీ అతిథులకు స్వాగతం

- సైబీరియా వలస పక్షుల రాక
- మే నెల నుంచి నవంబరు నెల వరకు విహారం
- నవంబరు తర్వాత స్వదేశానికి పిల్లలతో ప్రయాణం



రాజు చెరువులో కనువిందు చేస్తున్న సైబీరియా పక్షులు

బొండపల్లి: ఏటా క్రమం తప్పకుండా వచ్చే విదేశీ వలస పక్షులు సైబీరియా దేశం నుంచి వచ్చి చెరువుల్లో విహరిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. గడిచిన కొన్ని సంవత్సరాలుగా వేలాది కిలోమీటర్ల దూరంలో గల సైబీరియా దేశం నుంచి ప్రయాణం చేస్తూ ఏటా వచ్చి బొండపల్లి మండలంలో విడిది చేసి ఆహారం సంపాదించుకునే ప్రాంతాలను గుర్తించేందుకు వచ్చే ఈ పక్షులు ఈ ఏడాది కూడా మండలానికి వచ్చాయి. మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న రాజు చెరువులో సంవత్సరం పొడవునా నీరు ఉండడంతో పాటు చెరువు గట్ల చుట్టూ దట్టమైన చెట్లు ఉండడం, పక్షులకు కావాలిన్న ఆహారం పీతలు, పురుగులు, ఇతర ఆహారం పుష్కలంగా దొరికే అవకాశం ఉండడంతో క్రమం తప్పకుండా ఇక్కడికి పొడవైన కాళ్లు, పొడవైన ముక్కు, తెల్లని రెక్కలు, మెడ కింద ఎర్రని వెంట్రుకలతో కూడిన ఈ పక్షులు దేశం కాని దేశం నుంచి వస్తుంటాయి.

నవంబర్ వరకూ ఇక్కడే బస

ఈ పక్షులు ఏటా మే నెలలో వచ్చి నవంబరు నెల వరకు చెరువుల్లో దొరికే ఆహారాన్ని పగలంతా సేకరించి తిని రాత్రయ్యే సరికి గజపతినగరం మండలంలోని లోగిస గ్రామంలో గల చింత చెట్లుపై విశ్రాంతి తీసుకుంటాయి. గడిచిన కొన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఈ పక్రియ సాగుతోంది. వాటికి ఏ ఒక్కరూ హాని చేయడం, వేటాడడం వంటి పనులు చేయరు. ఆ పక్షులకు హాని చేయకూడదని గ్రామస్తులు వారికి వారే అంక్షలు విధించుకుని..ఈ పక్షులు వస్తే తమకు మంచి జరుగుతుందని భావిస్తారు. మే నెలలో ఇక్కడికి వచ్చి గుడ్లు పెట్టి, పొదిగి పిల్లలను కన్న తర్వాత ఆ పిల్లలు ఎగిరి వాటికి అవే ఆహారం సంపాదించుకునే పరిస్థితి వచ్చాక పిల్లలతో సహా ఈ పక్షులు స్వదేశానికి తిరుగు ప్రయాణమవుతుంటాయి. ఈ ప్రక్రియ ఏటా క్రమం తప్పకుండా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా ఈ పక్షులు వచ్చి చెరువులో ప్రస్తుతం కనువిందు చేస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి 258వ జయంతి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన సద్గురు త్యాగరాజస్వామి 258 జయంతి కార్యక్రమం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మోహన్‌కుమార్ త్యాగరాజ ఘనరాగ పంచరత్న కృతుల గానాన్ని స్థానిక విద్వాంసులతో కలిసి ఆలాపన చేశారు. డాక్టర్ కేఏ.పద్మప్రియ, పద్మావతి శారద, కొత్తపల్లి సుబ్బారావు, గంధం సుజాత, మహేశ్వరరావులు గానం చేయగా కాండూరి వేదవల్లి మంగతాయారు వీణపైన, భానుహర్ష వయోలిన్‌పైన, ప్రముఖ వేణుగాన విద్వాంసులు మోడేకుర్తి వెంకట కామేశ్వరరావు వేణువుపైన, మండపాక రవి మృదంగంపై సహకారం అందించారు. అనంతరం నిర్వహకులు మోహన్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో యామిజాల ప్రభున్యాసిరావు, గోపీకృష్ణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కంటకన్నీరు..!

- జ్యూట్ ఫ్యాక్టరీ తెరిపించరా అంటూ వేడుకోలు
- ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరిన కార్మికులపై మంత్రి ఆగ్రహం
- అపాయింట్‌మెంట్ లేకుండా ఎలా వస్తారంటూ మండిపాటు
- విస్తుపోయిన కార్మికులు, నాయకులు



మూతపడిన జీగిరాం జూట్ ఫ్యాక్టరీ

సాలూరు: పట్టణంలో శ్యామలాంబ పండుగ 15 ఏళ్ల తరువాత జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ పండగను ఘనంగా జరుపుకునేందుకు బంధువులకు పిలుపులు పెడుతూ సరదాగా పండగను చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీలో పనిచేసి, ఫ్యాక్టరీ మూతపడిన నేపథ్యంలో పట్టణంలో, మండలంలోని జీగిరాంతో పాటు పలు గ్రామాల్లో కార్మికుల పరిస్థితి దారుణంగా మారిన చిత్రాలు హృదయాలను కలిచివేస్తున్నాయి.నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టికున్న కార్మికుల కలలు కల్లలుగా మారిపోయాయి. అంతేకాదు ఇటీవల తమ గోడును వెళ్లబుచ్చుకుని ఫ్యాక్టరీ తెరిపిస్తామని నాడు ఎన్నికల సమయంలో హామీలిచ్చిన ప్రస్తుత మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణిలకు ఆ హామీని అమలుచేయాలని కోరేందుకు ఇటీవల పలువురు జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ కార్మికులు, నాయకులు మంత్రి సంధ్యారాణి ఇంటికి వెళ్లగా ,మంత్రి నుంచి వచ్చిన స్పందన చూసి కంగుతిన్నారు. అసలు అపాయింట్‌మెంట్ లేకుండా ఎలా వస్తారంటూ మంత్రి ఎదురు ప్రశ్నించడంతో సదరు కార్మిక సంఘం నాయకులకు గొంతులో పచ్చివెలక్కాయ పడిన పరిస్థితి ఎదురైంది. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా నేడు మంత్రిగా మరోలా మారిన ఆమె తీరుపై కార్మికులు,నాయకులు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.


ఫ్యాక్టరీ తెరిపించేందుకు కృషిచేసిన రాజన్నదొర

ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందంటూ గత ప్రభుత్వం హయాంలో ఫ్యాక్టరీ యజమానులు లాకౌట్ విధించగా, నాడు ఉపముఖ్యమంత్రిగా ఉన్న రాజన్నదొర ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు మేలు చేసేందుకు శతవిధాలుగా కృషిచేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఫ్యాక్టరీ యజమానులు, కార్మిక నాయకులతో కలిసి చర్చలు జరిపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడిన సంఘటనలు ఉన్నాయి. తరువాత ఎన్నికలు వచ్చిన క్రమంలో ఫ్యాక్టరీ తెరవాలంటూ కార్మికులు వద్ద ధర్నా చేపట్టగా నాడు సంధ్యారాణి వెళ్లి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చారు. నారా లోకేష్ సాలూరు పట్టణంలో ఎన్నికల సమయంలో నిర్వహించిన యువగళం సమావేశంలోను ఈ ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హామిలిచ్చిన ఇద్దరు నేతలు నేడు మంత్రులుగా ఉండి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు సంవత్సరం సమీపిస్తున్నా ఆ దిశగా అడుగులు పడకపోవడంతో కార్మికులు ఉసూరుమంటున్నారు.

వలసబాట పట్టిన కార్మికులు

1986లో ప్రారంభించిన ఈ ఫ్యాక్టరీలో వేలాది మంది కార్మికులు పనిచేశారు. ఫ్యాక్టరీ మూతబడడంతో వారంతా రోడ్డునపడ్డారు. కుటుంబపోషణ కష్టంగా మారడంతో కార్మికులు పొట్టకూటి కోసం వలసబాట పట్టారు. పలువురు ఏలూరు, రాజాంలతో పాటు వేరే రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు. కొందరు పట్టణంలో పండ్ల దుకాణాలు, టిఫిన్ దుకాణాల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్యామలాంబ పండుగ జరగనుందని దూరప్రాంతాలకు పనులకు వెళ్లిన కార్మికులకు తెలియడంతో, ఫ్యాక్టరీ తెరిచి ఉండి ఉంటే అక్కడే పనిచేసుకుంటూ, కుటుంబాలతో ఘనంగా పండుగ చేసుకునే పరిస్థితి ఉండేదని బాధపడుతున్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల్లోను ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చిన నేతలు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న ఏకైక ఈ జూట్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతున్నారు. కాగా పక్కనున్న విజయనగరం జిల్లాలో ఫ్యాక్టరీలు పునఃప్రారంభమవుతుండగా ఈ జిల్లాలో ఆ దిశగా అడుగులు పడకపోవడం గమనార్హం.

ఇచ్చిన హామీని మంత్రి నిలబెట్టుకోవాలి



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చిన మంత్రి సంధ్యారాణి ఆ హామీని నిలబెట్టుకుని ఫ్యాక్టరీని తెరిపించాలి. ఈ ఫ్యాక్టరీపై ఆధారపడిన వేలాది మంది కార్మికులు నేడు పొట్ట చేతపట్టుకుని వేర్వేరు రాష్ట్రాలకు వలసవెళ్లిపోయారు. ఫ్యాక్టరీ తెరిపించేందుకు మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

-ఎన్‌వైనాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



ఫ్యాక్టరీ మూతపడడంతో ఇళ్లకు తాళాలతో దర్శనమిస్తున్న జీగిరాం కాలనీ

పీహెచ్‌సీల్లో ప్రసవాల మెరుగుకు కృషి చేయాలి



స్టాఫ్‌నర్సులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

పార్వతీపురం టౌన్: మాతా, శిశు వైద్య సేవలు, పీహెచ్‌సీలో ప్రసవాల మెరుగు కోసం స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇచ్చామని ఆ దిశగా వారంతా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులకు ధ్రువీకరణ పత్రాలను శనివారం సాయంత్రం ఆరోగ్య కార్యాలయంలో ఆయన అందజేశారు. శిక్షణ నైపుణ్యాన్ని సద్వినియోగం చేయాలని డీఎంహెచ్‌ఓ ఈ సందర్భంగా వారికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు వైద్య సేవలను మరింతగా మెరుగు పరిచే లక్ష్యంగా, పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా కృషి చేసే దిశగా స్టాఫ్‌నర్సులకు ఎస్బీఏ (స్కిల్డ్ బర్త్ అటెండెంట్) రీఓరియంటేషన్ శిక్షణ నిర్వహించామని ఫిబ్రవరిలో ప్రారంభించి బ్యాచ్‌ల వారీగా ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డా. ఎం.నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.కేవీఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డా.టి.జగన్‌మోహనరావు, డా.పీఎల్. రఘుకుమార్, డీపీహెచ్ఎన్‌ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

18 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో పాటు వాహనం, నిందితుడితో పోలీసులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట సమీపంలో పందిరప్ప జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 18 కిలోల గంజాయి పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్.కోట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలీసులకు అందిన సమాచారం మేరకు పందిరప్ప జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెడ్ కలర్ మాక్సిమో ప్లస్ హౌస్‌హోల్డ్ ఫర్నిచర్ కలిగిన వాహనాన్ని తనిఖీ చేయగా 18 కిలోల గంజాయి పట్టుబడింది. వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఒడిశా నుంచి గంజాయి రవాణా చేస్తున్నట్లు చెప్పడంతో ఆ వ్యక్తిని అరెస్టు చేసి వ్యాన్, గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం టౌన్ : వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసిన సూచనల మేరకు జిల్లా అధికారులతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎల్లో అలెర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటించిందని ఆమె చెప్పారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, గాలులు 60 కిలోమీటర్లు వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేసిందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలు గుర్తించి అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రహదారులు, కల్వర్టు పైనుంచి నీరు పారే చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.